

# జనకుడు

**శ్రీ ఉపద్రష్ట వెంకట్రామయ్య**

(గత సంచిక తరువాయి)

## జానకి జయమాల వేసింది

ఈ పరిస్థితి గమనించి విశ్వామిత్రుడు రాముని వైపు చూసి ప్రయత్నించమని అనుజ్ఞ ఇస్తాడు. రాముడు గురువర్యులకు, సభకు నమస్కరించి వారి ఆజ్ఞగా ధనుస్సు వద్దకు వెళ్తాడు. ధనుస్సుకు మనస్కరిస్తాడు. దానిని అవలీలగా ఎత్తి అల్లెత్రాటిని తగిలించడానికి పైకొనను వంచుతాడు. అది ఫెళ ఫెళ ధ్వనులు చేస్తూ విరిగిపోతుంది. అధ్వానికి రామ లక్ష్మణులు, విశ్వామిత్రుడు, జనకుడు, సీత తప్ప మిగిలిన వారందరూ మూర్ఛపోతారు. కొంత సేపటికి వారందరూ మూర్ఛనుంచి తేరు కొంటారు. అపుడు రాజులు తలలు వంచు కొంటారు. ఆకాశంనుండి రాముని తలపై పుష్ప వర్షం కురుస్తుంది. దేవదుందుభులు మ్రోగుతాయి. జనకుని ముఖం వికసిస్తుంది. సభలోని వారందరూ తమ సీతకు తగిన తేజ స్సంపన్నుడు భర్తగా దొరికాడని సంతోషిస్తారు. సీత రాముని మెడలో జయమాల వేస్తుంది.

## మిథిలకు విజయం చేయండి

విశ్వామిత్రునితో వినయంగా జనకుడిలా అంటాడు ''మహాత్మా! రాముని పరాక్రమం తేటతెల్లమయింది. ఇంతటి అద్భుత కార్యం జరుగుతుందని నేను కలలో కూడ ఊహించలేదు. నా ప్రతిజ్ఞ నెరవేరింది. ఇంతటి తేజోమయ పరాక్రమ సంపన్నుడు నాకు అల్లుడు కావడం నా అదృష్ట విశేషమే. ప్రాణంతో సమానంగా చూసుకొంటూ ఉండే సీతను శ్రీరామునకిస్తాను. మీరు అనుమతిస్తే ఇపుడే ఈ శుభవార్తను దశరథ మహారాజుకు తెలిపి తీసికొని రావడానికి నా మంత్రులను అయోధ్యకు పంపుతాను.''

విశ్వామిత్రుడు దానికి సమ్మతిస్తాడు. ఇతని ధర్మ తత్పరతకు మెచ్చుకొంటాడు. జనకుడు వెంటనే మంత్రులను సపరివారంగా అయోధ్యకు పంపుతాడు.

జనకుడు మంత్రులద్వారా దశరథునకీ విధంగా వర్తమానం పంపుతాడు. ''దశరథ మహారాజా! నా కుమార్తె సీత వివాహ విషయంలో నేను వీర్యశుల్కాన్ని నిర్ణయించడం, రాజులు ఆ పరీక్షలో ఓడిపోవడం మీకు తెలిసిందే. విశ్వామిత్రునితో పాటు రామ లక్ష్మణులు దైవికంగా ఇక్కడకు వచ్చారు. శ్రీరాముడు శివధనుస్సును అవలీలగా ఎక్కుపెట్టాడు. అది విరిగిపోయింది. నా ప్రతిజ్ఞ ప్రకారం నేను సీతను రామునకిచ్చి వివాహం చేయదలచుకొన్నాను. దానికి తమరు అనుమతించాలని కోరుతున్నాను. సపరి వారంగా ఇక్కడకు దయచేసి ఈ శుభ కార్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేయించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.''

మంత్రులు వెళ్లి దశరథునికి వృత్తాంతం అంతా వివరిస్తారు. జనకుని సందేశం వినిపిస్తారు. అది విని దశరథుడు పరమానంద



భరితుడవుతాడు. వశిష్ఠుడు, వామదేవుడు మొదలైనవారు వాళ్ళందరికీ ఈ విషయం చెపుతాడు. వారందరూ జనకుని వినివమ సౌశీల్యాలనం సవయయజ్ఞతనం మెచ్చుకుంటారం. వెంటనే సపరివారంగా బయంలుదేరి దశరథుడం మిథిలకు చేరుకొంటారు.

## ఈ వంశం పవిత్రమైంది

జనకుడం ఎదురేగి వారందరికీ స్వాగతం పలికి తగు విధంగా విడుదులు ఏర్పాటు చేస్తాడు. తన వైభవానికి లోటులేని విధంగా వారందరికీ తగిన మర్యాదలు చేస్తాడు.

దశరథునితో జనకుడిలా అంటాడు ''ఆర్యా! దైవకృపవల్ల, తమరాకవల్ల నా జన్మ ధన్యమైంది. నైనం తలపెట్టిన యాగం నిర్విఘ్నంగా పూర్తి అవుతుంది. యాగం చివరన కన్యాదానం చేయడం ఋషి సమ్మతమైన విషయం. మీ రఘువంశ సంబంధం కలుపుకోవడంవల్ల నా వంశమూ పవిత్రమయింది.''

ఆనాటికి చేయవలసిన కార్యాలు పూర్తి చేసి దశరథుడు, జనకుడు ఈ రాత్రి సుఖంగా గడుపుతారు.

జనకుడం సీతను మిక్కిలి ప్రేమతో పెంచాడు. అతని తమ్ముడు కుశధ్వజునికి మాండవి ఊర్మిళ శ్రుతకీర్తి అని ముగ్గురు కుమార్తెలు. జనకుడు తన తమ్ముడికి కూడ రమ్మని కబురంపాడు. కుశధ్వజుడం సాంకాశ్యం నుండి సపరివారంగా మిథిలకు వస్తాడు. వసిష్ఠుడు జనకునికి దశరథుని వంశ చరిత్రను వివరంగా చెబుతాడు. అలాగే జనకుడు దశరథునికి తన వంశచరిత్రను వివరిస్తాడు. ఈ విధంగా వారు వారి వారి వంశ చరిత్రలను తెలిసికొంటారు.

## మీకెంతో కృతజ్ఞుడను

విశ్వామిత్రుడు, వసిష్ఠుడు జనకునితో ఇలా అంటారు. ''మహాత్మా! ఇక్ష్వాకువంశం, నిమి వంశం రెండూ పరమ పవిత్రాలయ్యాయి. ఊర్మిళ లక్ష్మణునకు, నీ తమ్ముని కుమార్తెలు భరత శత్రుఘ్నులకు అన్ని విధాల తగినవారు. సీతా కల్యాణంతోపాటు అందరి వివాహం జరిపించమని కోరుతున్నాము.''

ఆ మాటలకు జనకమహారాజు పరమానందపడి ఇలా విన్నవిస్తాడు. ''మునీంద్రులారా! నా శ్రేయస్సుకోరి తమరే ఈ సంబంధాలను సమకూర్చి, ఈ ధర్మ కార్యాలను నెరవేర్చి పెట్టడం నా పూర్వజన్మ సుకృత విశేషం వల్లనే. మీకు సర్వదా కృతజ్ఞుడను.

ఈ విధంగా జనకుడం సీతనం రామునకు, ఊర్మిళనం లక్ష్మణునకు ఇచ్చి వివాహం చేయాలనీ, తన తమ్ముని సమ్మతితో అతని కుమార్తెలను భరత శత్రుఘ్నులకు ఇచ్చి ఆ ముహూర్తంలోనే వివాహం జరిపించాలనీ నిశ్చయిస్తాడు. యాగశాలలో గంధాక్షతాది పూజాద్రవ్యాల్ని సంసిద్ధం చేస్తారు. వివాహ మండపం యథావిధిగా అలంకరింపబడుతుంది. దశరథుడు యాగశాలకు చేరుతాడు. శ్రీరాముడం తమ్ములతోపాటు గోదానాది మంగళక్రియలు పూర్తిచేసి యాగశాలలో తండ్రి ప్రక్కనే కూర్చుంటాడు.

## ఇయం సీతా......

వసిష్ఠుడు జనకునితో దశరథుడు వచ్చి వేచి ఉన్నాడని తెలుపుతాడు. అపుడు జనకుడు ''మహాత్మా! దశరథుని రాకకు అడ్డులేదు. ఈ రాజ్యం నాకు ఎలాంటిదో దశరథ మహారాజుకు అలాంటిదే. అన్ని సంభారాలతో ఇదిగో వస్తున్నాను' అని చెబుతాడు. నేను – నాది అనే తత్త్వానికి అతీతంగా జనకుడు ఉంటాడనే విషయం ప్రస్ఫుటంగా మనకు గోచరిస్తుంది. వెంటనే జనకుడు సర్వాభరణాలతో అలంకరింపబడిన కుమార్తెలతో సపరివారంగా అచటకు వస్తాడు. ముహూర్త సమయం సమీపిస్తుంది.

''ఇయం సీతా మమ  
సుతా సహధర్మచరీ తవ  
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే  
పాణిం గృహ్ణీష్వ పాణినా  
పతివ్రతా మహాభాగా  
ఛాయేవానుగతా సదా.''

అంటూ జనకుడు మంత్రపూతమైన జలాన్ని రాముని చేతిలో ధారపోస్తాడు. అంటే ''ఓ రామా! ఈ సీత నా కుమార్తె. ఇకపై నీ సహధర్మచారిణి. ఈమెను స్వీకరించు. నీకు మేలు కలుగు గాక. ఈమె చేతిని నీచేతితో పట్టుకో (పాణి గ్రహణం చెయ్యి). సౌభాగ్యవతి పతివ్రత అయిన ఈ సీత ఎల్లవేళలా నిన్ను నీడగా అనుసరిస్తుంది అంటూ కన్యాదానం చేస్తాడు. అందరూ హర్షధ్వానాలు చేస్తారు. దేవదుందుభులు మ్రోగుతాయి. పుష్పవర్షం కురుస్తుంది. అపుడే లక్ష్మణునికి ఊర్మిళను, తన తమ్ముని కుమార్తెలను భరతునికి మాండవిని, శత్రుఘ్నునకు శ్రుతకీర్తిని దానం చేస్తాడు.

సోదరులు నలుగురూ నలుగురు కన్యలను పాణిగ్రహణం చేసి, ముమ్మారు అగ్నికి ప్రదక్షిణం చేసి, పెద్దలకు నమస్కరించి వారి ఆశీస్సులతో గృహస్థులవుతారు.

ఈ విధంగా సాక్షాత్తు లక్ష్మీదేవినే అయోనిజ అయిన కుమార్తెగా పొంది, సాక్షాత్తు శ్రీమహావిష్ణువునే అల్లునిగా పొందిన జనకుడు ధన్యజీవి అయ్యాడు. ఇంతటి అదృష్టం ఎంతమంది గృహస్థుల కుంటుంది ఈ లోకంలో? రాముడంటే మూర్తీభవించిన ధర్మంగదా, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అవతరించిన శ్రీరామచంద్రునికి మామగారుగా జనకుడు సకల లోకపూజ్యుడయ్యాడు.

## సంగరహితుడైన సమ్రాట్టు

జనకుడం సమ్రాట్టు. రాజుకంటె

ఎక్కువ అధికారం కలిగి రాజులను కూడ పాలించగల్గి సార్వభౌమాధికారం కలవాడు సమ్రాట్ అని ఋగ్వేదాదులలో చెప్పబడి ఉంది. శతపథబ్రాహ్మణం మొదలైన గ్రంథాలలో జనకుని సమ్రాట్టుగా పేర్కొన్నారు. జనకుడు సమ్రాట్టు అయినా సంసార బంధాలలో చిక్కుకోనివాడు. గొప్ప జ్ఞాని, స్థితప్రజ్ఞుడు. ఇతనికి యాజ్ఞవల్క్యుడు మొదలగు నూరుమంది గురువులు ఉండేవారు. వారు ఎల్లప్పుడు ఇతనికి తత్త్వ విషయాల్ని బోధిస్తూ ఉండేవారు. ఇతని సభలో ఎల్లప్పుడు వేదాంతచర్చలు జరుగుతూ ఉండేవి. చాలమంది ఋషులు, మునులు వచ్చి ఇక్కడ తమ జ్ఞానతృష్ణను తీర్చుకొని వెళ్లేవారు. అక్కడ జరిగే చర్చలలో తాను కూడ పాల్గొంటూండేవాడు. పరాశరుడు, వసిష్ఠుడు మొదలైన మహర్షులు ధర్మం తపస్సు మొదలైనవాటి ప్రాముఖ్యాన్ని ఇతనికి బోధించేవారు. ఇతడు కూడ మాండవ్యుడు, శుకుడు మొదలైన యోగులకు జ్ఞానబోధ చేశాడు. ఇక్కడ జరిగే చర్చలలో మైత్రేయి, గార్గివంటి బ్రహ్మవాదినులు కూడ పాల్గొనేవారు. వారందరి మేధా సంపద జనకుని జ్ఞానానికి బాగా పదునుపెట్టింది.

## మిథిలలో నాదేదీ లేదు

ఒకసారి గురువు జనకుని పరీక్ష చేయాలనుకొంటాడు. సభలో వేదాంత చర్చ జరుగుతోంది. ఋషులు చాలమంది దానిలో పాల్గొన్నారు. ఇంతలో ఋష్యాశ్రమాలు, మిథిలా నగరం తగులబడిపోతున్నట్లు అగపడింది. అందరూ తమ తమ ఆశ్రమాల్ని కాపాడుకోటానికి సభ విడిచి పరుగెడతారు. జనకుడు అలాగే కూర్చుంటాడు. ఓ రాజా! మిథిలానగరం తగులబడిపోతుంటే నీ విక్కడే కూర్చున్నావేమి? అని గురువు అడుగుతాడు. జనకుడు ప్రసన్నవదనంతో 'అక్కడ ఎన్ని ధనరాసులున్నా అందులో నాది కొంచెమయినా లేదు. మిథిల తగులబడి పోయినా నాదంటూ నశించి పోయేది ఏదీ లేదు' అని సమాధానం చెబుతాడు. అందరికంటె గూడ ఇతనిలో ఉన్న స్థితప్రజ్ఞతకు గురువు ఆశ్చర్య పడతాడు. జ్ఞాననిష్ఠను మెచ్చుకొంటాడు.

## కర్తవ్యాన్ని విడిస్తే మోక్షం వస్తుందా?

ఒకప్పుడు జనకుడు వైరాగ్యంతో రాజ్యాన్ని విడిచి భిక్షావృత్తితో జీవించాలని తలుస్తాడు. అపుడు ఇతని భార్య 'నాథా! గృహస్థునిపై ఆధారపడి చాలమంది బ్రతుకుతారు. పెట్టేవానిదే పైచేయిగా ఉంటుంది గాని బిచ్చమెత్తేవానిది కాదు గదా. అంతేగాక చాలమంది మహాత్ములు నీవల్ల బ్రతుకుతున్నారు. వారందరినీ బాధలలో ముంచి అకర్మణ్యుడవై నీ కర్తవ్యాన్ని విడిచిపెడితే మోక్షం వస్తుందా' అని చెబుతుంది. అపుడు కర్తవ్యాన్ని నెరవేరుస్తూ ముక్తుడుగా ఉండడానికి పూనుకొంటాడు.

## ఈ సంబంధాలు అశాశ్వతాలు

మరొకసారి జనకుడు బంధు నియోగంతో దుఃఖిస్తూ రాజ్యం విడిచిపెట్టి వెళ్లాలని అనుకొంటాడు. అశ్మకుడనే ముని దేశదేశాలలో తిరుగుతూ ఇతనివద్దకు వస్తాడు. 'సర్వమూ కాలాధీనం. బంధువులతో గల సంబంధం నదీప్రవాహంలో కొట్టుకొని పోయే కట్టెల సంబంధం లాగా అశాశ్వతం. కనుక ఈ విచారం విడిచిపెట్టి నీ కర్తవ్యం నెరవేర్చు' అని ఆ ముని బోధిస్తాడు. దీనితో జనకుడు కర్తవ్యోన్ముఖుడవుతాడు.

జనకునికి ఎల్లప్పుడూ నూర్గురు ఆచార్యులు బోధిస్తూ ఉండేవారు గదా. వాటిని చెప్పినవి చెప్పినట్లు ఇతడు మననం చేసికొనేవాడు. తానుకూడ చర్చలలో పాల్గొని తన నిర్ణయాలు చెప్పి మెప్పించేవాడు. ఒకనాడు పంచశిఖుడనే మునిశ్రేష్ఠుడు దేశాలు తిరుగుతూ మిథిలా నగరానికి వస్తాడు. అతడు గొప్పతత్త్వవేత్త, జ్ఞాని. అతడు వాదనలో ఈ నూరుమందినీ జయిస్తాడు. జనకుడు వినయంతో ప్రార్థించగా ఆయనకు ఈ విధంగా తత్త్వోపదేశం చేస్తాడు.

## కర్మలు చేసినా వాటిలో చిక్కుకోకూడదు

బంధువులు, ధనధాన్యాలు మొదలైనవి అస్థిరాలు. లోభమోహాదులవల్ల అవిద్య కలుగుతుంది. వాటిని విడిచి ఆత్మజ్ఞానం పొందితేనే శాంతికలుగుతుంది. నదులు సముద్రంలో లీనమైనట్లుగా సత్త్వాది గుణాలు ఆత్మలో లీనంకావాలి. నీటిలోపడ్డ ఉప్పు కణంలాగా మనస్సును సుఖదుఃఖాలలో ప్రవేశింపనీకుండా ఆత్మలో లీనం చెయ్యాలి. కర్మలు చేస్తూ కూడ ఆ కర్మలలో చిక్కుకోకుంటే కుబుసం విడిచిన పాములాగా ప్రకాశిస్తాడు. ఇదే వైరాగ్యం. దీనివల్ల మోక్షం కలుగుతుంది. జనకునకు అపరిమితమైన వైరాగ్యం కలుగుతుంది. కర్తవ్యం నెరవేరుస్తూ కూడ సంసారబంధాలలో చిక్కుకొనకుండా నిశ్చలస్థితిలో ఉండగలుగుతాడు.

## నీవు నిజంగా ముక్తుడవు

ఒకనాడు సులభ అనే యోగిని జనకుని వైరాగ్యాన్ని పరీక్షించడానికి అతని వద్దకు వస్తుంది. యోగమహిమ వల్ల ఆమె కృశించిన తన శరీరాన్ని సుందర సుకుమారమైన రూపంగా మార్చి వస్తుంది. రాజు ఆమెకు ఆతిథ్యం ఇస్తాడు. ఆమె తన మహిమవల్ల జనకుని మనసులో ప్రవేశించి మనోవికారం కలిగిస్తూ అతనికి సమీపంలో కూర్చుంటుంది. జనకుడు చిరునవ్వుతో ఓ యువతీ, నీవెవరివి? ఎవరిదానవు? ఎక్కడి నుంచి వస్తున్నావు? ఎచటికి పోతున్నావు? అని అడుగుతూ ఇంకా ఇలా అంటాడు.

**(సశేషం)**